క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల/ఎలిగేడు: ఓదెల మండలం హరిపురం, కొలనూర్ గ్రామాలకు చెందిన ఇద్దరు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఎల్‌వోసీ పత్రాలను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదివారం ఎలిగేడు మండలం శివపల్లిలో వారి కుటుంబసభ్యులకు అందజేశారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓదెల మండలం హరిపురం గ్రామానికి చెందిన లక్ష్మన్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.1,10,000 ఎల్‌వోసీ, ఓదెల మండల కొలనూర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డికి రూ.2,25,000 ఎల్‌వోసీ పత్రాలను అందించారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవీందర్‌గౌడ్, నాయకులు పాకాల కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

చెట్లపొదల్లో సూచిక బోర్డు



ఓదెల: మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని లెవల్ క్రాసింగ్ గేట్ సమీపంలో స్టాప్ లుక్ అండ్ ప్రొసీడ్ బోర్డు చుట్టూ చెట్లపొదలు పెరిగాయి. దీంతో ప్రయాణికులకు గేట్ ఉందనే విషయం తెలియక ఇబ్బంది పడుతున్నారు. రైళ్లు వచ్చేటప్పుడు గేట్‌వేసి ఉంటుంది. బోర్డు పూర్తిగా చెట్లపొదల్లో ఉండటంతో గేట్ ముందు ఉందనే విషయం తెలియక వాహనదారులు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. చెట్లపొదల్లో బోర్డు ఉన్నప్పటికీ రైల్వేశాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న మహేందర్, తదితరులు

సుల్తానాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులన్నీ ప్రభుత్వం భర్తీ చేసేందుకు ప్రణాళిక తయారు చేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయడమే కాకుండా గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు వెంటనే రాత పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ జనాభాకు అనుగుణంగా నామినేటెడ్ పోస్టులు 50శాతం ఇవ్వడంతో పాటు ఉద్యోగుల రిజర్వేషన్లు బీసీలకు న్యాయం చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బీసీ ఐక్యవేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేశ్‌కుమార్, రంగు క్రాంతిగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అభిషేక్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నిఖిల్ ఉన్నారు.

సీఐని ఉద్యోగం నుంచి తొలగించాలి

గోదావరిఖనిటౌన్: దళిత ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ చావుకు కారణమైన సీఐ జితేందర్‌రెడ్డిని, నలుగురు కానిస్టేబుళ్లను విధుల నుంచి తొలగించి హత్యా నేరం నమోదు చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో దళిత ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్‌ను సీఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు సన్యాసినాయుడు, సుభాని, శేఖర్, శివనాగరాజు, ఉమెన్ పీసీ శివ నాగరాణి కుల వివక్షతో అవమానించి ఆత్మహత్యకు కారకులయ్యారని ఆయన ఆరోపించారు. కారకులపై ఎస్సీ, ఎస్టీ, హత్యానేరం కింద కేసులు నమోదు చేసి వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులైన సీఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లను ఉద్యోగం నుంచి తొలగించి ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు కందుకూరి రాజరత్నం, మద్దెల దినేశ్, ఆసాల రమ, ఎర్రాల రాజయ్య, శనిగరపు తిరుమల, శేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం సరిచేయండి సారూ



పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లికి చెందిన రైతు గాలిపెల్లి దుర్గయ్యకు చెందిన పొలంలో విద్యుత్ స్తంభం ఒకపక్కకు వంగి ప్రమాదకరంగా ఉంది. దుర్గయ్య పొలం రామారావుపల్లిలో ఉంది. ప్రస్తుతం కౌలు రైతు పొన్నవేని హరీశ్ సాగు చేస్తున్నాడు. వర్షాకాలంలో బలంగా వీచే ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం కింద పడిపోయే ప్రమాదముంది. ఈ విద్యుత్ లైన్ల కింద 33కేవీ లైన్లు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని రైతు ఆందోళన చెందుతున్నాడు. ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా మేడిపెల్లి రోడ్డు



జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఎన్టీపీసీ మేడిపల్లి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మేడిపల్లి సెంటర్ నుంచి భరత్‌నగర్ బోర్డు వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం అస్తవ్యస్తంగా ఉండటం, అసంపూర్తి డివైడర్స్‌తో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మధ్యలో చాలా వరకు విద్యుత్ స్తంభాలు సగం వరకు విరిగిపోవడంతో రాత్రి సమయాల్లో వాహనదారులకు సరిగ్గా కనిపించక వాటిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. బల్దియా అధికారులు సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఆధునీకరించడంతో పాటు రోడ్డు మధ్యలో విరిగిన స్తంభాలను తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

వెలగని హైమాస్ట్ లైట్



నాంసానిపల్లెలో వెలగని హైమాస్ట్ లైట్

ఓదెల: మండలంలోని నాంసానిపల్లె గ్రామంలో చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ వెలగడం లేదు. కొన్నిరోజులుగా హైమాస్ట్ లైట్ వెలగకపోవడంతో రాత్రిపూట ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వసతిగృహ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖనిటౌన్: ఎన్టీపీసీ సీఎస్‌ఆర్ నిధులతో స్థానిక పాత మున్సిపల్ ఆఫీసు పక్కన గల స్థలంలో నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ వసతిగృహ నిర్మాణ పనులను రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ భవనాన్ని నాణ్యతతో నిర్మించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్లు లక్ష్మణ్‌గౌడ్, మహంకాళి స్వామి, ముస్తఫా నాయకులు సతీశ్, శివ, మోబిన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

గోదావరిఖని: క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడమాస పర్వదినం పురస్కరించుకుని బోనం సమర్పించారు. ఎమ్మెల్యే సతీమణి ఎంఎస్ మనాలీఠాకూర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద మెడిసిన్ విద్యార్థినికి ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నీరుకుల్ల గ్రామానికి చెందిన కాదాసి హర్షిత సిద్దిపేట మెడికల్ కాలేజీలో ఎంబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. హర్షిత తల్లిదండ్రులు శ్రమజీవులు. హర్షిత విషయం తెలుసుకున్న బహుజన ఏకలవ్య ఫౌండేషన్ ఏడాదికి రూ.6వేల చొప్పున మెడిసిన్ పూర్తయ్యే వరకు అందించేందుకు ముందుకు వచ్చింది. ఫౌండేషన్ సభ్యులు మానుపాటి కరుణ రమేశ్ దంపతులు మొదటి ఏడాదికి రూ.6వేల చెక్కును అందించారు. హర్షిత విద్యాభ్యాసానికి దాతలు ముందుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు. బహుజన ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మానుపాటి రాజయ్య, ప్రధాన కార్యదర్శి మొగిలి శ్రీనివాస్, ప్రతినిధులు బిజిలి సమ్మయ్య, దాసరి సతీశ్, భూర్గు శ్రీనివాస్, తండ్రి రాజయ్య పాల్గొన్నారు.

శ్రీపదాలు సాహితీ సమూహం ఆత్మీయ సమ్మేళనం

గోదావరిఖనిటౌన్: శ్రీపదాలు సాహితీ సమూహం 4వ వార్షికోత్సవం ఆత్మీయ సమ్మేళనం, 5వ శ్రీపద సంపుటాల రచనల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం స్థానిక తిలక్‌నగర్‌లోని గణేశ్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత హాజరయ్యారు. ఈ సందర్భంగా అనూశ్రీ గౌరోజు రచించిన వేద నవల, దార స్నేహలత రచించిన శ్రీపద స్నేహితాలు, సాతుకు రత్నజానకి రచించిన మనోహరాలు, యెలిగేటి శ్రీలత రచించిన శ్రీపద కౌముది, వేముల వరలక్ష్మి రచించిన సిరులైన శ్రీపదాలు, పోతుల ఉమాదేవి రచించిన శ్రీపద పారిజాతాలు మొత్తం 5 సంపుటాలను ఆవిష్కరించారు. శ్రీపదాలు సాహితీ వేదిక అధ్యక్షుడు జేవీ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులు దాస్యం లక్ష్మయ్య, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ పెంట రాజేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: స్థానిక విద్యానగర్‌లోని శ్రీరామ విద్యాలయంలో 1997–98లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులు మాజీ మేయర్ జాలి రాజమణి, పద్మ, జ్యోతి, కృష్ణవేణి, శ్రీధర్‌రెడ్డి, రమేశ్‌ను పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, చంద్రశేఖర్, సుమన్, మధు, రమేశ్, యుగేందర్, మల్లేశ్, సత్యనారాయణ, రాజేందర్, లావణ్య, జ్యోతి, స్వరూప పాల్గొన్నారు.



రోడ్డుపై మురుగు నీరు

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ సోషల్ వెల్ఫేర్ కళాశాలకు వెళ్లే రహదారిపై మురికి నీరు నిలిచి ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. రోడ్డుపై నడుస్తున్నప్పుడు దుర్వాసన వస్తోందని, అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కాలనీవాసులు కోరుతున్నారు. మురికినీరు రాకుండా చూడాలని అధికారులను కోరారు.

బీరుసీసాతో దాడి

గోదావరిఖని: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోల్ వాషరీస్ సమీపంలో ఆదివారం ఒక వ్యక్తి బీరుసీసాతో దాడి చేసి గాయపర్చాడు. శ్రీకాంత్ అనే వ్యక్తి నగేష్‌పై బీరుసీసాతో దాడిచేయడంతో తలకు గాయాలయ్యాయి. ఇతడిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.

గణేశ్‌నగర్‌లో చోరీ

స్థానిక గణేశ్‌నగర్‌లో ఆదివారం చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి పెద్దపల్లికి వెళ్లగా వచ్చేసరికి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. బంగారం, వెండి సామగ్రి చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు.

ఓటీటీలోకి నందిని లఘు చిత్రం

గోదావరిఖనిటౌన్: స్థానిక సింగరేణి కార్మికుడు గొట్టె మహేశ్ ఇటీవల నిర్మించిన ప్రేమకథా లఘు చిత్రం 'నందిని' ఎన్నో అవార్డులను, రివార్డులను సొంతం చేసుకుంది. పెద్ద చిత్రాల సరసన చేరి ఆదివారం ఈ చిత్రం బీసీ ఐనెట్‌లో విడుదలైంది. ఈ సందర్భంగా స్థానిక కళాకారులు, లఘు చిత్ర దర్శకులు, సినిమా అభిమానులు మహేశ్‌ను అభినందించారు.

బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే



బోనంతో ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల: మండలంలోని గూడెంలో జరిగిన బీరప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు బోనం ఎత్తుకున్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయంలో గోరింటాకు వేడుకలు



గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో ఆషాడమాసం సందర్భంగా మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు. ఆదివారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గోరింటాకు పెట్టుకున్నారు.

బీటీ రోడ్డుపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లతో నడపొద్దు



రోడ్డుపై ఏర్పాటు చేసిన సైన్‌బోర్డు

పెద్దపల్లిరూరల్: 'రైతన్నలూ..ఆలోచించండి.. కొత్తగా కోట్లాది రూపాయలతో నిర్మించిన తారురోడ్లపై కేజ్‌వీల్స్ బిగించిన ట్రాక్టర్లను నడిపి రోడ్లను పాడు చేయవద్దు' అంటూ పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్, తుర్కలమద్దికుంట అధికారులు రోడ్లపై సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను నడిపించొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5వేల జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తారని కలెక్టర్ పేరిట బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

రామగుండం: ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం అంతర్గాం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించారు. మండల అధ్యక్షుడు రవీందర్ నేతృత్వంలో మాజీ జెడ్పీటీసీ ఆముల నారాయణ, మాజీ ఎంపీపీ దుర్గం విజయ, మాజీ వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, మాజీ ఎంపీటీసీలు కొలిపాక శరణ్య, రమేశ్, షేక్ గౌస్‌పాషాను పూలమాల, శాలువాతో సత్కరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శోభన్‌బాబు, కాంపెల్లి నర్సయ్య, గద్దల లింగస్వామి, మల్లేశ్, నాగరాజు, రాములు, పోశం, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పూదరి సత్తయ్య గౌడ్ ఉన్నారు.

వారాహిదేవి గుప్త నవరాత్రి ఉత్సవాలు



హారతి ఇస్తున్న మహిళలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న సాంబశివాలయంలో వారాహిదేవి గుప్త నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమ పూజలు వెండి హారతితో ప్రమిదలు తీసుకొని అమ్మవారికి హారతి ఇచ్చారు. అమ్మవారికి బెల్లం పానకంతో నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.

కలర్ కార్డుల పద్ధతి రద్దు చేయండి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు ఎల్లో, రెడ్ కార్డులు జారీచేసే విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కార్యదర్శి కవ్వంపల్లి స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్డుల పేరిట కార్మికులను ఇబ్బంది పెడితే ఊరుకోబోమన్నారు. విధుల్లో పొరపాట్లు చేయకున్నా ఎల్లో, రెడ్ కార్డులను జారీచేస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఈవిషయంలో గుర్తింపు యూనియన్‌కు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఒకసారి ప్రమాదానికి కారకులైన వారిని ఎల్లో కార్డు, మూడుసార్లు కారకులైన వారికి రెడ్‌కార్డు జారీ చేస్తారని, దీనిద్వారా కార్మికులు తీవ్రమానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఎల్లో, రెడ్ కార్డులను తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈనెల 19న జరిగే సింగరేణి ఉన్నతస్థాయి త్రైపాక్షిక సమావేశంలో దీనిపై ఆందోళన చేస్తామన్నారు. నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని వారు తెలిపారు. నాయకులు ఆరెల్లి పోశం, సంకె అశోక్, రంగు శ్రీనివాస్, ఎస్.వెంకట్‌రెడ్డి, గండి ప్రసాద్, మిట్ట శంకర్, దొంత సాయన్న, ఎంఏ గౌస్, సిద్దమల్ల రాజు, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, ఎం.సంపత్, తాని రాజబాబు, రవి, ఎల్.రాజకిశోర్, బండారి శ్రీనివాస్, అటికేటి రాజు, దాసరి శ్రీనివాస్, సారయ్య, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

క్వార్టర్ల తొలగింపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

- అఖిలపక్ష కమిటీ నాయకుల నిర్ణయం



సంఘీభావం ప్రకటిస్తున్న అఖిలపక్ష నాయకులు

గోదావరిఖని: సింగరేణి క్వార్టర్ల తొలగింపు నిర్ణయాన్ని యాజమాన్యం వెనక్కి తీసుకోవాలని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో క్వార్టర్ల తొలగింపుపై ఆదివారం అఖిలపక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. గోదావరిఖని నగరం పూర్తిగా మైనింగ్‌పై ఆధారపడ్డ ప్రాంతమన్నారు. ఇక్కడ మైనింగ్ కార్యకలాపాలు ముగిస్తే ఇక్కడి ప్రాంతం ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే జీడీకే–5 ఓసీపీతో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పట్టణ సుందరీకరణ విషయంలో భారీ ప్రతిపాదనలు కాకుండా, పరిమిత ఉనికిని గమనంలోకి తీసుకుని అవసరాల మేరకే అభివృద్ధి చేయాలని కోరారు. సింగరేణి క్వార్టర్ల తొలగింపును కేవలం ప్రధాన రోడ్డు వైపున్న క్వార్టర్లను తొలగించే వరకే పరిమితం చేయాలని, కేవలం 12 క్వార్టర్లను తొలగిస్తే సరిపోతుందన్నారు. మూడు వరుసల క్వార్టర్లు తొలగించి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తామనడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. సింగరేణి క్వార్టర్ల బాధితుల పక్షాన నాయకత్వం వహిస్తున్న తోటవేణు నేతృత్వంలో జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బీజేపీ నుంచి సుల్వ లక్ష్మీనర్సయ్య, టీడీపీ నుంచి వీరేందర్, స్నేహ సాహితి, ఏలేశ్వరం వెంకటేశ్, హ్యూమన్ రైట్స్ నుంచి కిరణ్ జీ, న్యూ ఇండియా పార్టీ నుంచి వేముల అశోక్, ఎమ్మార్పీఎస్ నుంచి ఉప్పులేటి పర్వతాలు, అడ్వకేట్స్ జేఏసీ నుంచి పులిపాక రాజ్‌కుమార్, మాల మహానాడు నుంచి శ్రీహరి, రాజేశ్వర్‌రావు, శేఖర్, సింగరేణి కార్మిక కుటుంబాలు పాల్గొన్నాయి.

నేత్రదానంపై అపోహలు వీడాలి



అభినందన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

పాలకుర్తి: నేత్రదానంపై అపోహలు వీడి అవగాహన పెంచుకోవాలని, మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి, జిల్లా సలహాదారులు దేవీ లక్ష్మీనర్సయ్య అన్నారు. పాలకుర్తి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన అందె లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా వారి కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. ఆదివారం లక్ష్మీ నివాసంలో నిర్వహించిన సంస్మరణ సభలో కుటుంబసభ్యులకు సదాశయ ఫౌండేషన్ అభినందన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులకు నేత్ర, అవయవదానంపై ఫౌండేషన్ సభ్యులు అవగాహన కల్పించారు. ఫౌండేషన్ పాలకుర్తి మండల అధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్, బొడ్డుపల్లి లక్ష్మణ్, బుర్ర సదిగౌడ్, చింతకింది కనుకయ్య, గుండేటి రమేశ్, బూర్ల తిరుపతి, దాసరి సాగర్, రేగుల సంజీవ్, భీమనపల్లి కరుణాకర్, అంజి పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సుల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

గోదావరిఖని: 2024–25 సంవత్సరానికి గాను సింగరేణి సేవాసమితి ఆర్జీ–2 ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు అనుభవజ్ఞులైన టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తి విద్యాకోర్సులైన టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ కోర్సులు నేర్పించడంలో అనుభవం ఉన్న ఫ్యాకల్టీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులతో పాటు నేర్పించు కోర్సు సర్టిఫికెట్స్, అనుభవం, విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జత చేసి ఆర్జీ–2 జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.